క్లుప్తంగా

నేడు అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

పీలేరు : స్థానిక కోటపల్లె మార్గంలోని శ్రీ దివ్యయోగ విద్యాలయం శిక్షణా కేంద్రంలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

కలికిరి: జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం కలికిరి విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వినియోగదారులు విద్యుత్ పొదుపు పద్ధతులను పాటించాలని డీఈఈ శివయ్య కోరారు. కార్యక్రమంలో ఏఈ ముజీబుర్ రెహ్మాన్, ఈఆర్ఓ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లి : మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ కళాశాలలో తాత్కాలిక అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. ఫిజిక్స్ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. పీజీ, డిగ్రీలో 50 శాతం పైగా మార్కులు సాధించిన ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8712625076 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఏపీ గురుకుల పాఠశాలలో..

మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల గణిత సబ్జెక్టుకు అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మాజి తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ ఒకటి, ట్రైనడ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టు ఒకటి ఖాళీ ఉన్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు నేరు పాఠశాలకు వచ్చి గానీ, 8712625051 నెంబరులో గానీ సంప్రదించాలని కోరారు.

అరటిపండ్ల అలంకారంలో అంజన్న



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అరటిపండ్లతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు సాయి స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలంకరణకు వాడిన అరటిపండ్లను ఆదివారం వానరులకు వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ అటల్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం

పీలేరు : స్థానిక సీఎస్ఆర్ కాలేజీకి జాతీయ అటల్ అచీవ్‌మెంట్ అవార్డు లభించినట్లు ఆ కాలేజీ కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో జరిగిన అటల్ సమ్మాన్ సమరోహ కార్యక్రమంలో ఆజ్‌తక్, ఇండియా న్యూస్, మేడ్ గేట్ టుడే సంయుక్తంగా నిర్వహించిన అటల్ అచీవ్‌మెంట్ అవార్డు 2024 ప్రదానం చేశారు. ఇందులో భాగంగా పీలేరు సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు జాతీయ అటల్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు.

తాగునీటి సమస్యను పట్టించుకోరా?

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో తాగునీటి సమస్య ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పాగసూరి వీధిలోని బోరు మోటారు కాలిపోయి నెల రోజులు దాటినా ఇంతవరకు అధికారులు మరమ్మతులు చేయడం లేదని తెలిపారు. అదే విధంగా సంత బజారులోని బోరు మోటారు చెడిపోతే వాటిని వెలికి తీసి వారం రోజులు కావస్తున్నా ఇంత వరకు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుప్తనిధుల తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గుర్రంకొండ: మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ బోడిగుట్ట కోటలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారంటూ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కోటలో గుప్తనిధుల ఉంటాయనే ప్రచారంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈసంఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యునానీ వైద్యశాల ఉన్నా.. లేనట్లే?

- ఆసుపత్రిలో వైద్యుడు పోస్టు ఖాళీ
- ఉన్న అటెండర్ మదనపల్లెకు బదిలీ
- ఇబ్బందులు పడుతున్న రోగులు



గుర్రంకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గుర్రంకొండ: గుర్రంకొండలో యునానీ వైద్యశాల ఉన్నా లేనట్లే అన్న చందంగా మారింది. ఆస్పత్రి ప్రారంభమైనప్పటి నుంచి ఇక్కడ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న అటెండర్‌ను ఆరునెలల కిందట మదనపల్లెకు బదిలీ చేశారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2007 సంవత్సరంలో యునానీ వైద్యశాలను ఏర్పాటు చేశారు. డాక్టర్, కాంపౌండర్, అటెండర్ పోస్టును మంజూరు చేశారు. అయితే రెగ్యులర్ డాక్టర్ లేక పోవడంతో చింతపర్తి, తంబళ్లపల్లె ఆస్పతి వైద్యులు ఇక్కడ ఇన్‌చార్జిలుగా పనిచేశారు. వారంలో మూడురోజుల పాటు ఇక్కడి రోగులకు ఆస్పత్రిలో అందుబాటులో ఉండేవారు. అయితే కాంపౌండర్ పోస్టు మాత్రం ఇప్పటికీ భర్తీ చేయలేదు. కేవలం అటెండర్ ఒక్కరే అందుబాటులో ఉంటేవాడు.

యునానీ వైద్యానికి గుర్తింపు

ఈ ప్రాంత ప్రజలు యునానీ వైద్యానికి అలవాటు పడడంతో ఈ వైద్యానికి ఆదరణ కూడా పెరిగింది. 1963 నుంచి 1988 వరకు స్థానిక పాత గ్రంథాలయ భవనంలో యునానీ వైద్యశాల నిర్వహించేవారు. అప్పట్లో ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇదొక్కటే ప్రభుత్వ వైద్యశాలగా ఉండేది. ప్రతిరోజు రోగులు ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందేవారు. మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, సోరియాసిస్, కీళ్లవాపులు, షుగరు, మలబద్ధకం, ఉబ్బసం వంటి వ్యాధులకు మందులు అందుబాటులో ఉండేవి. 1988లో ఆస్పత్రిలో వైద్యసేవలు నిలిచిపోవడంతో వైద్యశాల మూతపడింది. ఈ ప్రాంత వాసులు చిరకాల వాంఛను నెరవేరస్తూ 2007లో అప్పటి ప్రభుత్వం తిరిగి గుర్రంకొండలో యునానీ వైద్యశాలను ఏర్పాటు చేసింది.

రోగులు ఆవేదన

ఆస్పత్రిలో డాక్టర్ పోస్టు భర్తీకి నోచుకోక పోగా ఏడాది కిందట వరకు ఇన్‌చార్జిగా పనిచేస్తున్న వైద్యుడిని తొలగించారు. అటెండర్‌ను కూడా ఆరు నెలల కిందట మదనపల్లె ఆస్పత్రికి బదిలీ చేశారు. దీంతో ఆస్పత్రిలో అన్ని పోస్టులు ఖాళీగా ఉండడంతో యునానీ వైద్యసేవలు నిలిచిపోయాయి. దీంతో వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో దశాబ్దాల పాటు ఈ ప్రాంతం ప్రజలకు సుపరిచితమైన యునానీ వైద్యసేవలు నిలిచిపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

ఆస్పత్రిలో ఎవరూ లేరు



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనే ఓ గదిలో యునానీ వైద్యశాలను నిర్వహించేవారు. డాక్టర్ మాత్రం ఇక్కడ లేరు. ఆస్పత్రి గదిలో ఓ చోట మందులు ఉంచుకోవడానికి ఫర్నిచర్ ఉండేది. ఒక అటెండర్ మాత్రమే ఇక్కడ పనిచేసేవారు. కొద్దినెలల కింద అటెండర్ మదనపల్లెకు బదిలీపై వెళ్లిపోయాడు. ప్రస్తుతానికి ఎవరూ ఇక్కడ లేరు.

–రవీంద్రనాయక్, వైద్యాధికారి, గుర్రంకొండ

జగనన్న జన్మదిన వేడుకలకు తరలిరండి

మదనపల్లె : ప్రజాసంక్షేమ రథసారధి, అభివృద్ధి ప్రదాత, జనహృదయ విజేత వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరపాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని దేశాయ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తామన్నారు. అనంతరం 11 గంటలకు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ తదితర సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కురబలకోట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం ఉదయం పది గంటలకు అంగళ్లు కూడలిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్సీ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

కలకడ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఉదయం 10–30 గంటలకు కలకడ బస్టాండ్‌లోని దివంగిత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు, వైఎస్సార్ సీపీ అభిమానులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నాలని కోరారు.

రామసముద్రం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం రామసముద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో కేక్ కట్ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ప్రతిభ



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

మదనపల్లె : పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఆల్ డిజిటెక్ కంపెనీ ప్రతినిధులు జరిపిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది విద్యార్థులు ప్రతిభ కనపరచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, కరస్పాండెంట్ ఎస్. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఆల్ డిజిటెక్ కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్ బి.బాబా ఫక్రుద్దీన్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. అందులో 35 మంది విద్యార్థులు టెక్నికల్ అసోసియేట్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.5లక్షల వేతనం ఇస్తారని, బెంగళూరు, చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ బి.వి.రమణాచారి, వైస్‌ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి లక్ష్మీప్రసన్న

కలికిరి: నీరు, ఎరువుల వినియోగంపై కేవీకే కార్యాలయంలో మైక్రో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 31వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందుకు నీటి వసతి కలిగిన ప్రతి రైతును గుర్తించి సూక్ష్మబిందు సేద్యం కోసం రిజిస్ట్రేషన్ చేయించి ప్రాథమిక సర్వే పూర్తి చేయాలన్నారు. ఐదు ఎకరాలు లోపు విస్తీర్ణం కలిగిన రైతులకు 90 శాతం, 10 ఎకరాలు లోపు కలిగిన వారికి 70 శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా పంటలు సాగుతో మొక్కలకు అవసరాన్ని బట్టి నీరు, ఎరువులు వినియోగించడం వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మదనపల్లి, పీలేరు ఉద్యానశాఖ అధికారులు ఈశ్వరప్రసాద్‌రెడ్డి, సుకుమార్ రెడ్డి, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐఏఓలు దుర్గయ్య, ఉమాదేవి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

మదనపల్లె : లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ కోసం సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్న బాధితుడికి రూ.5లక్షల చెక్కు అందజేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని ఎగువ కురవంకకు చెందిన ఖాదర్‌బాషా, నూర్జహాన్ కుమారుడు బావాజాన్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని బాప్టిస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి శస్త్రచికిత్స చేసేందుకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని ఆస్పత్రి వైద్యులు చెప్పడంతో బాధితుడి తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కలిసి ఆదుకోవాల్సిందిగా కోరారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే కుమారుడు జునైద్ అక్బరీ, బాధిత కుటుంబానికి అందజేశారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పీలేరురూరల్ : గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బాలంవారిపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 50 అర్జీలు వచ్చాయని, గడువులోపు ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమా, నోడల్ ఆఫీసర్ భరత్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలకడ: భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వివరాలను మండల రెవిన్యూశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలస్థాయి అధికారులు చొరవ తీసుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కె.బాటవారిపల్లె పంచాయతీలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రత్యేక అధికారి రవిచంద్రబాబు, డిప్యూటీ తహసీల్దార్ భార్గవి, సర్వేయర్ దేవి, వీఆర్ఓ షాజహాన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె : వలసపల్లె పంచాయతీలో నెలకున్న రెవెన్యూ సమస్యలకు అధికారులు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శనివారం మండలంలోని వలసపల్లె సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, డీటీ అస్లాంబాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వలసపల్లె పంచాయతీ సర్వే నంబర్ 663లో స్వాతంత్ర్య సమర యోధులు నూతి రాధాకృష్ణయ్య భార్యపేరు మీద ఇచ్చిన స్థలంలో వేసిన అప్రూవ్డ్ లేఅవుట్‌లో తాము ప్లాట్లు కొనుగోలు చేశామని, 2017లో దీన్ని 22(ఏ) జాబితాలో చేర్చడంతో ప్రస్తుతం స్థలాన్ని అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే రీసర్వేలో మొలకలదిన్నె వద్ద ప్రైవేట్ భూముల విస్తీర్ణం తక్కువగా నమోదు చేశారని, వాస్తవ విస్తీర్ణం నమోదుచేయాలని కోరారు. 1బీ, మ్యుటేషన్, పాసుపుస్తకాలు తదితర అనేక సమస్యలపై మొత్తం 80 అర్జీలకు పైగా ప్రజలు రెవెన్యూ అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో వీఆర్ఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

పెద్దమండ్యం: రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను పరిష్కరించు కోవాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. పెద్దమండ్యం గ్రామ పరిధిలోని చెరువుకిందపల్లెలో శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎస్ బాషా అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. భూముల ఆన్‌లైన్, సర్వే, మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాల కోసం వినతి చేశారు. అలాగే పింఛన్లు, ఇతర సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సదస్సులో అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రసానిపల్లెలో రెవెన్యూ సదస్సు

తంబళ్లపల్లె: మండలంలోని ఎర్రసానిపల్లెలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. ప్రజలు రెవెన్యూ రికార్డులలో సవరణల కొరకు ఐదు అర్జీలు, ఎఫ్‌లైన్ పై ఒక అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదు ఇస్తున్నట్లు తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయతీ కలిచెర్ల వడ్డిపల్లెలో శుక్రవారం బాటగంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో మూడవరోజు జరిగిన కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్ పద్మావతమ్మ, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, సర్పంచ్‌లు బాషా, జింకా విశ్వనాథ, కంటి విశ్వనాథరెడ్డి, విజయకుమారి, ఎంపీటీసీ జయరాం, చాంద్ బాషా, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు

రామసముద్రం: రామసముద్రం మండలం పెద్ద కురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలురకాల పుష్పాలు, వేపాకుతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పీలేరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ఉన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, షఫీ, మల్లికార్జున, శ్రీకాంత్, సదాశివ, రాజేశ్వరి, హరినాయక్, బద్దె భానుప్రకాష్, కృష్ణయ్య, ఆనంద్, బాలగంగాధర్, రవిచంద్ర, సురేంద్ర, రెడ్డెయ్య, గురునాధ, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాలి

మదనపల్లె : భారత పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బీఎస్పీ మదనపల్లె ఆధ్వర్యంలో అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీఎస్పీ నాయకులు సహదేవ, రమణ, గంగాధర, మల్లికార్జున, అరుణ్, మహేష్, ఉదయ్, ప్రశాంత్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు నోడల్ అధికారి డుమ్మా !



మాట్లాడుతున్న సమగ్ర శిక్షా సీఎంఓ

పెద్దతిప్పసముద్రం: గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని ప్రజలు అసంతృ వ్యక్తం చేస్తున్నారు. సదస్సులను పర్యవేక్షించాల్సిన అధికార గణం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు ‹మీ భూమి–మీ హక్కు › నినాదంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మండలంలో ఇప్పటి వరకు 9 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు ప్రధాన భూమిక పోషించే ఈ సదస్సుల్లో కొన్ని రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి రాకుండా రెవెన్యూ అధికారులు తప్పుదారి పట్టించే అవకాశం ఉంటుందనే భావనతో రెవెన్యూయేతర జిల్లా స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా జిల్లా కలెక్టర్ ప్రతి మండలానికి ఒక అధికారిని నియమించారు. పెద్దతిప్పసముద్రం మండల నోడల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారిని నియమించారు.

9 గ్రామాల్లో..

మండలంలో ఇప్పటి వరకు 9 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా నోడల్ అధికారి నాలుగు సదస్సులకు డుమ్మా కొట్టడం గమనార్హం. ఆయన కింది స్థాయి అధికారులు, ఎంఈఓ, సమగ్ర శిక్షా అధికారులను ఆయన తరపున సదస్సులకు పంపడం విమర్శలకు తావిస్తోంది. డీఈఓ హాజరైన సదస్సుల్లో కూడా హాజరు నమోదు చేసి సమీప పాఠశాలల సందర్శనకు ఆయన అధిక సమయం కేటాయించడం ఏంటని పలువురు విమర్శలు సంధిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని కమ్మచెరువులో జరిగిన రెవెన్యూ సదస్సుకు సమగ్రశిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి హాజరయ్యారు. తహసీల్దార్‌తో పాటు మిగిలిన రెవెన్యూ సిబ్బంది మాత్రం సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటున్నారు. ప్రతి అర్జీని ఆర్టీజీఎస్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉన్నా చాలా మందిని రెవెన్యూ సిబ్బంది సర్ది చెప్పి పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదే నోడల్ అధికారి అందుబాటులో ఉండి ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసేలా చొరవ చూపితే ప్రజలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ఈ విషయంపై శుక్రవారం డీఈఓ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా జిల్లా కేంద్రంలో సమావేశం ఉన్నందున తాను హాజరు కాలేదని తన తరపున సమగ్రశిక్షా సీఎంఓను పంపామన్నారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్ కూడా ఇదే విషయాన్ని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వండి



ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బి.కొత్తకోట: మండలంలోని మొటుకుపల్లె పంచాయతీ అటవీప్రాంతంలోని పురాతన ఆలయ నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని గ్రామస్తులు, నాయకులు అటవీ, రెవెన్యూశాఖ అధికారులను విన్నవించారు. దీనిపై శుక్రవారం అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. మొటుకుపల్లె కనుమలో పురాతన లక్ష్మినరసింహస్వామి ఆలయం ఉంది. ఇందులో కొత్తగా నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉన్నందున అనుమతులు ఇవ్వాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వై.శివ, మాజీ ఎంపీటీసీ ఉమాదేవి, గ్రామస్తులు కోరారు. ఆలయాన్ని పరిశీలించిన అధికారులు దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి



కురబలకోట : మండలంలోని విశ్వం కళాశాల దగ్గర శుక్రవారం రాత్రి వాహనం ఢీకొని గుర్తు తెలియని యువకుడు(26) మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. యువకుడు బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడి శరీరంపై బ్లూ కలర్ షర్టు, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా బాస్ ఆవిర్భావ వేడుకలు



బాస్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పీలేరు : భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద బాస్ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా బాస్ జిల్లా కోకన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వజన సమతా సమాజ నిర్మాణం వైపు విశాల ప్రజా సమూహాలను కదలించడానికి బాస్ కృషి చేస్తోందని తెలిపారు. బాస్ నాయకులు కృష్ణయ్య, నాగరాజ, నాగేశ్వర్‌రావు, హరినాథ, మల్లికార్జున, గురవయ్య, రామకృష్ణ, రాంబాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. బాస్ నాయకులు కేవీ రమణ, సింగన్న, రమణ, గంగన్న, రవి పాల్గొన్నారు.

కుల నిర్మూలనే బాస్ లక్ష్యం

మదనపల్లె : సమసమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశించిన, కుల నిర్మూలన – స్టేట్ సోషలిజం సాధించడమే లక్ష్యంగా భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) పోరాటం చేస్తోందని, ఆసంస్థ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక కాలనీగేట్ వద్ద ఆయన బాస్ జెండాను ఎగురవేసి 13వ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఎక్సైజ్ సీఐ జవహర్ బాబు, విశ్రాంత ఏఎస్పీ పెద్దయ్య, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మండెం ప్రభాకర్, ఉద్యోగ నాయకులు మంచూరి మారెప్ప, నరసింహులుతోపాటు బాస్ నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: భారతీయ అంబేడ్కర్ సేన ఆవిర్భావ దినోత్సవ వేడుకను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన నాయకులు బాస్ 13 ఏళ్ల చరిత్రలో సాధించిన విజయాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో బాస్ సమన్వయ కమిటీ సభ్యులు కేవీ.రమణ, సింగన్న, సచిన్, వెంకటేష్, రమణ, రామప్ప, రామాంజనేయులు, సురేష్, శ్రీరాములు, గంగన్న పాల్గొన్నారు.